## క్లుప్తంగా

### అభివృద్ధి పనుల పరిశీలన

**పులివెందుల టౌన్ :** వార్డు పర్యటనలో భాగంగా శనివారం స్థానిక 1వ వార్డు జయమ్మ కాలనీలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలసి సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### లక్కీ డిప్ విజేతలకు బహుమతులు

**పులివెందుల రూరల్ :** స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం డయిల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని ఆర్టీసీ డీఎం రామకృష్ణ పరిష్కరించారు. సాయంత్రం 4 గంటలకు ముద్దనూరు రోడ్డులో ఉన్న కొత్త బస్టాండులోని ఎంక్వైరీ కౌంటర్ నందు ప్రయాణికుల సమక్షంలో లక్కీ డిప్ తీశామని ఈ లక్కీ డిప్‌లో గెలుపొందిన ముగ్గురి పేర్లు, వారి సెల్ నెంబర్ల వివరాలను ఆయన వివరించారు. వీరపునాయునిపల్లెకు చెందిన ప్రభావతి, కడపకు చెందిన ప్రమీళమ్మ, వేంపల్లెకు చెందిన తరుణ్‌కుమార్‌రెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు.

### ఢిల్లీకి మేరి మట్టి మేరా దేశ్ కలశం

**కమలాపురం :** మేరి మట్టి–మేరా దేశ్‌లో భాగంగా కమలాపురం మండలంలోని 18 పంచాయతీల నుంచి సేకరించిన మట్టి కలశాన్ని ఢిల్లీకి పంపిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. నా మట్టి నా దేశం వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని అన్ని పంచాయతీల నుంచి సేకరించిన మట్టిని ఒక కలశంలో నింపి దానిని ప్యాక్ చేసి మదర్ థెరిసా సేవా సమితి అధ్యక్షుడు జూటూరు విజయ్‌కు అందజేశామన్నారు. ఆయన కడపకు చెందిన నెహ్రూ యువకేంద్రం ద్వారా ఈ మట్టి కళశాన్ని ఢిల్లీకి పంపడం జరుగుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శారదా రెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు ఆత్మీయ కృతజ్ఞత సభ


**కమలాపురం :** మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతం కావడంతో ఆదివారం తిప్పలూరులోని ఏకేఆర్ కల్యాణ మండపంలో ఆత్మీయ కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు జేసీఎస్ కన్వీనర్ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి, సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజుల రెడ్డి హాజరు కానున్నారని, మండలంలోని వలంటీర్లు, గృహ సారధులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ అభిమానులు హాజరు కావాలని ఆయ న తెలిపారు.

### పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి

**ఎర్రగుంట్ల :** పట్టణ ప్రజలు పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. నగర పంచాయతీ పరిధిలో ఆయన శనివారం స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. పట్టణ ప్రజలు చెత్తను రోడ్లు, కాలువల్లో వేయకుండా మున్సిపల్ పారిశుద్ధ్య వాహనాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పి.జగన్నాథ్, కో ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి, మున్సిపల్ శానటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, ఆర్ఓ గంగిరెడ్డి, మెప్మా సీఓలు, కార్మికులు పాల్గొన్నారు.

### ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టండి


పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఉమామహేశ్వర్‌రావు

**కమలాపురం :** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది చేస్తున్న ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఉమామహేశ్వర్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని దేవరాజుపల్లెలో జరుగుతున్న ఇంటింటీ సర్వే ను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఏ ఇంట్లో ఏ వ్యాధిగ్రస్తులు ఉన్నారో నోట్ చేసుకోవాలని అలాగే ఈనెల 29వ తేదీ వరకు సర్వే చేయాలన్నారు. 30వ తేదీన సచివాలయాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి వారికి మందులు పంపిణీ చేయాలన్నారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు.

### నేడు జరిగే సదస్సును విజయవంతం చేయండి

**పులివెందుల టౌన్ :** గ్రేటర్ రాయలసీమ వడ్డెర్ల మేధోమదన సదస్సుకు ప్రతి ఒక్క సోదరుడు హాజరై విజయవంతం చేయాలని పులివెందుల వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆదివారం స్థానిక విజయగార్డెన్‌లో జరిగే గ్రేటర్ రాయలసీమ వడ్డెర మేధోమదన సదస్సులో 10 జిల్లాలకు సంబంధించి 67 నియోజకవర్గాలు 287 మండలాల 47 మున్సిపాలిటీల నుండి ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

# అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయండి

- మున్సిపాలిటీ పరిధిలో రూ.280 కోట్ల పనులు
- రోడ్ల నిర్మాణానికి మరో రూ.20 కోట్లు
- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

**కమలాపురం :** కమలాపురం మునిసిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగ వంతం చేసి, త్వరిత గతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మార్పురి మేరి అధ్యక్షతన అధికారులు, కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే రివ్యూ సమావేశం నిర్వహించారు. పబ్లిక్ హెల్త్, ఆర్అండ్‌బీ, మెడికల్, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులు తమ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధి పనుల వివరాలను తెలియజేశారు. మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలాపురం మున్సిపాలిటీలో రూ.280 కోట్ల మేరకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరో రూ.20 కోట్లు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అవుతాయన్నారు. అభివృద్ధి పనులు జరిగే సమయంలో ప్రజలకు కొంత మేరకు ఇబ్బందులు తప్పవన్నారు. అయితే అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేసి జాప్యాన్ని తగ్గించాలన్నారు. మనం మంచి పనులు చేస్తూ ప్రజలతో చీవాట్లు తినడం ఎంత వరకు సబబు అని కాంట్రాక్టర్లను ప్రశ్నించారు. రూ.300 కోట్ల మేరకు జరిగే పనులన్నీ మూడు మాసాల్లో పూర్తి చేయాలన్నారు. పనులు చేసే సమయంలో ఎక్కడైనా ఇబ్బందులు వస్తే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఏ సమయంలోనైనా నాకు ఫోన్ చేయవచ్చని, నేను ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అభివృద్ధి పనులు పూర్తి అయితే కమలాపురం పట్టణం ఒక మోడల్‌గా తయారు అవుతుందన్నారు. శుక్రవారం విజయవాడలో అన్ని శాఖల ప్రిన్సిపాల్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించానని, ఆర్ఓబీ, బైపాస్, మున్సిపల్ బిల్డింగ్ తదతర పనులన్నింటికి ఒకటి–రెండు రోజుల్లో క్లియరెన్స్ వస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి నిర్మాణం కోసం

# రైతులు సహకరించాలి

**–ఆర్డీఓ జి.శ్రీనివాసులు**


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జి.శ్రీనివాసులు

**జమ్మలమడుగు :** నంద్యాల–జమ్మలమడుగు వరకు ఏర్పాటు చేసే జాతీయ రహదారికి రైతులు సహకరించాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు కోరారు. శనివారం జమ్మలమడుగు, పెద్దముడియం మండలాలకు చెందిన భూములు కోల్పోతున్న రైతులతో, జాతీయ రహదారి అధికారులతో కలసి ఆర్డీఓ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. పెద్దముడియం మండలంలోని నాగిరెడ్డిపల్లె, గుల్లకుంట గ్రామాలు, జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు, మోరగుడి, జమ్మలమడుగు, కన్నెలూరు ప్రాంతాలకు చెందిన రైతుల భూములలో జాతీయ రహదారి వెళుతోందన్నారు.

అత్యధికంగా జమ్మలమడుగు మండలంలోని 37.12 సెంట్లు భూమి అవసరం అవుతుందని మొత్తం 174 మంది రైతుల భూముల్లో ఈ రహదారిపోతుందన్నారు. ప్రభుత్వం నిబంధన ల ప్రకారం ఎస్.ఉప్పలపాడు గ్రామ రైతులకు రూ.12.51 లక్షలు, మోరగుడి రైతులకు రూ.16 లక్ష లు, జమ్మలమడుగు కన్నెలూరు రైతులకు ఎకరాకు రూ.24 లక్షల పరిహారం ఇవ్వడంకోసం ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కాబట్టి రైతులు తమకు సంబంధించిన ఏమైన ఇబ్బందులు ఉంటే తమకు తెలియపరచాలన్నారు. జాతీయ రహదారి నిర్మాణం జరిగితే భూములకు మంచి ధర పలికే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే జాతీయ రహదారి నిర్మాణం కోసం సంబంధించిన భూసర్వే పూర్తిచేసి గెజిట్ విడుదల చేశామన్నారు. రైతులు వీలైనంత త్వరగా సమ్మతిని తెలియజేస్తే జాతీయ రహదారి పనులు వేగవంతం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈ సురేంద్రారెడ్డి, తహసీల్దార్‌లు సి.గురప్ప, జ్యోతి, డీటీ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతాం


ప్రజల సమస్యలను జేసీకి విన్నవిస్తున్న మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి

**వేముల :** గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చిన అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ తెలిపారు. ఈనెల 13వ తేదీ కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వేములలో ప్రజా సమస్యలపై ప్రజాదర్బార్ నిర్వహించారు. ఇందులో పలు సమస్యలపైన ప్రజలు ఎంపీకి వినతిపత్రాలను అందజేశారు. ఆయన అర్జీలను జిల్లా అధికారులకు పంపారు. ఈ విషయమై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జేసీ ప్రత్యేక సమావేశం నిర్వహించగా మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి జేసీకి వివరించగా ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, ప్రజలు పాల్గొన్నారు.

**తొండూరు :** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజుల సూచనల మేరకు జేసీ గణేష్ కుమార్ ప్రజలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమస్యలపై వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి రెవెన్యూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, రాష్ట్ర శాప్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి, తహసీల్దార్ బాల నరసింహులు, సర్వేయర్ గంగాధర, సచివాలయ సిబ్బంది, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


చీని వేలంపాటను తిలకిస్తున్న వైఎస్ మధురెడ్డి

**పులివెందుల రూరల్ :** రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని తొండూరు మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో రైతులు పండించిన చీనీకాయలను విక్రయాలు చేసేందుకు చీనీకాయల మండీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చీనీకాయలకు సూట్ లేకుండా చేయాలనే దృఢసంకల్పంతో ముందడుగు వేశారన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సలహాలతో ప్రతి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించి రైతు భరోసా కేంద్రాల వద్ద కేంద్రాలకు వచ్చే రైతులకు పోస్టర్ల ద్వారా గ్రేడింగ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి సూచనలతో ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతులు, చీనీ వ్యాపారస్తులు అందరు కలిసి చీనీ కాయలకు సూట్ లేకుండా అవగాహన సదస్సు నిర్వహించి గ్రేడింగ్ పద్ధతిని అవలంభించాలన్నారు. అందువల్ల ప్రతి రైతు గ్రేడింగ్ చేసుకుని తాము పండించిన పంటలను మార్కెట్‌యార్డుకు తీసుకురావాలన్నారు. ఆది, సోమవారాలు సెలవు దినాలు కావడంతో మార్కెట్‌యార్డుకు చీనీకాయలు తీసుకువచ్చే రైతులు మంగళవారం ఉదయం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, మార్కెట్ ఏడీ ఆజాద్, హార్టికల్చర్ అధికారి రాఘవేంద్రారెడ్డి, మార్కెట్‌యార్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# క్రీడా పోటీల్లో విశేష ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి


ప్రతిభ కనబరచిన విద్యార్థులతో కరస్పాండెంట్ ఎస్ఎఫ్ బాషా, తదితరులు

**వేంపల్లె :** వేంపల్లె జడ్పీహెచ్ఎస్ క్రీడామైదానంలో 15, 16వ తేదీలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన వివిధ విభాగాల క్రీడాపోటీలలో వేంపల్లె శ్రీచైతన్య పాఠశాలకు చెందిన 65 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. వీరిని కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్స్ చేతన్ రెడ్డి, చైతన్యరెడ్డి తదితరులు అభినందించారు. అలాగే వివిధ విభాగాల క్రీడాపోటీలలో వేంపల్లె లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. వీరిని కరస్పాండెంట్ ఎస్ఎఫ్ బాషా, ప్రిన్సిపాల్ ముబీనా, పీఈటి జనార్ధన్, తదితరులు అభినందించారు.

# పండ్ల తోటల పెంపకాన్ని విస్తృతం చేయండి


పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ యదు భూషణ్‌రెడ్డి

**కమలాపురం :** ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకాన్ని విస్తృతం చేయాలని డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని దేవరాజుపల్లె, పెద్దచెప్పలి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద సాగు చేసిన మునగ, పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలించారు. అనంతరం చదిపిరాళ్ల వద్ద సీఎల్ఆర్‌సీ కోసం ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు. త్వరిత గతిన నిర్మాణం చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అలాగే మండలంలోని ఉపాధి హామీ ద్వారా పంటల పెంపకాన్ని విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఏపీఓ నరసింహులు, ఈసీ అన్నా నాయక్, సీఎల్ఆర్‌సీ సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆత్మహత్యల నిర్మూలనే లక్ష్యం

**పులివెందుల రూరల్ :** ఆత్మహత్యల నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎస్ఈఐఎఫ్ చైర్మన్ శామ్యూల్‌రెడ్డి అన్నారు. శనివారం జేఎన్టీయూ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ స్పందన ఈడ్ ఇంటర్నేషన్ ఫౌండేషన్ సహకారంతో లైఫ్ ఈస్ ప్రిసియస్–వ్యాలు ఇట్ అనే అంశంపై విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఈఐఎఫ్ ముఖ్య ఉద్దేశం ఆత్మహత్యలు లేని నవభారతాన్ని నిర్మించడమే లక్ష్యమన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో దేశవ్యాప్తంగా ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి నిర్మూలనే లక్ష్యంగా స్పందన ఈడ్ ఇంటర్నేషన్ ఫౌండేషన్ వారు పలు కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులకు అవగాహన కల్పించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం ఆత్మహత్యల నిర్మూళనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగం అధిపతి వేణుగోపాల్‌రెడ్డి, కెమిస్ట్రీ విభాగపు అధిపతి శేషమహేశ్వరమ్మ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

### మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం లక్ష్యం

**చక్రాయపేట :** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ కాపునేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారని రాయల్ కాపునాడు కడప పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు సంగా హేమలత తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 45, 60 సంవత్సరాలలోపు ఉన్న కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన మహిళలకు వరుసగా నాలుగవ ఏడాది వైఎస్ఆర్ కాపునేస్తం ద్వారా నేరుగా వారి ఖాతాలలోకి రూ.15 వేలు జమచేయడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో కాపు సంక్షేమానికి జగనన్న పెద్దపీట వేయనున్నారన్నారు.

# భూమాతకు గొడుగు ఓజోన్ పొర


కమలాపురంలో ఓజోన్ పొర చిత్రాలతో విద్యార్థులు


పులివెందులలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

**కమలాపురం :** భూమాతకు గొడుగు ఓజోన్ పొర అని పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఓబుల్‌రెడ్డి తెలిపారు. శనివారం ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్‌లో గొడుగు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమాతకు గొడుగు ఓజోన్ పొర అని, ఈ పొరను సంరక్షించు కోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సూర్యుని నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలను అడ్డుకుని భూమిని రక్షించే సహజ రక్షణ ఛత్రం ఓజోన్ పొర అని, కాలుష్యం వల్ల నేడు ఆ పొర దెబ్బ తింటోందన్నారు. తద్వారా చర్మ వ్యాధులు, కంటి జబ్బులు, క్యాన్సర్లు వస్తాయన్నారు. విద్యార్థులకు ఓజోన్ పొర–రక్షణ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీ లు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పులివెందుల టౌన్ :** ప్రపంచ ఓజోన్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, వైఎస్ వీఆర్ఎం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్), స్నేహిత అమృత హస్తం సేవాసమితిల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో ఆయా విద్యాసంస్థలలో ఓజోన్ పొరపైన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఓజోన్ పేరు ఆకారంలో వినూత్నంగా ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే కళాశాల విద్యార్థినిలచే కళాశాల నుంచి ర్యాలీని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, పీఆర్ఓ డాక్టర్ బాలనారాయణ, జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ నాగేంద్రమ్మ, సేవాసమితి అధ్యక్షుడు రాజులు ప్రారంభించారు.

**ఎర్రగుంట్ల :** భూమి మీద ఉన్న జీవరాశి మనుగడకు ఓజోన్ పొర ఎంతగానో ఉపయోగపడుతుందని దాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జేవీవీ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న తెలిపారు. శనివారం అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో దీనిపై కార్యక్రమం నిర్వహించారు.

**వేంపల్లె :** మారుతున్న జీవన విధానం, ప్రపంచ నవీకరణ పద్ధతుల నేపథ్యంలో ఓజోన్ పొరను రక్షించుకోవలసిన ఆవశ్యకత ఎంతో ఉందని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా రసాయన శాస్త్ర విభాగాధిపతి నాగేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు ఓజోన్‌పొర మీద అవగాహన కల్పిస్తూ క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలైన వారికి బహుమతులను అందజేశారు.

### ఘనంగా గ్రామోత్సవం


శ్రీకృష్ణుని ప్రతిమతో గ్రామోత్సవం

**పులివెందుల టౌన్ :** త్రైత సిద్ధాంతం–ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక పులివెందుల కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ పరమాత్ముని గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని జన్మాష్టమి వేడుకలలో భాగంగా శనివారం ఈ ర్యాలీ స్థానిక అంకాలమ్మ ఆలయం వద్ద నుంచి పార్నపల్లెరోడ్డు, పూలంగళ్ల సర్కిల్, ముత్యాలవారివీధి, అమ్మవారిశాల, మెయిన్‌బజార్, ఆర్టీసీ సర్కిల్ మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. కోలాటాలు, నృత్యాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం–ఇందూ జ్ఞానవేదిక పట్టణ అధ్యక్షుడు గోపీనాథ్, సభ్యులు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రబోధ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

### పండుగను శాంతియూతంగా జరుపుకోవాలి


శాంతి కమిటీ వారికి సూచనలు ఇస్తున్న పట్టణ సీఐ ఈశ్వరయ్య

**ఎర్రగుంట్ల :** వినాయక చవితి పండుగను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని పట్టణ సీఐ ఈశ్వరయ్య తెలిపారు. శనివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో శాంతికమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. కుల, మతాలతో బేదాలు లేకుండా అందురూ కలసికట్టుగా నిర్వహించుకోవాలని అలాగే ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలన్నారు.

**సింహాద్రిపురం :** వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రోషన్ హెచ్చరించారు. ఆయన శనివారం పోలీస్‌స్టేషన్‌లో మత పెద్దలతో పీస్ కమిటీ నిర్వహించి మాట్లాడారు. విగ్రహాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా చూసుకోవాలన్నారు.

### వాటర్‌ప్లాంట్ ప్రారంభం

**తొండూరు :** ఇనగలూరు గ్రామంలోని ఎరుకల నాంచారమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్‌ప్లాంట్‌ను శనివారం తొండూరు మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి ప్రారంభించారు. అమెరికాలో ఉన్నటువంటి ఎన్ఆర్ఐ జగన్ మోహన్‌రెడ్డి, తిప్పిరెడ్డిపల్లె ఎరికలరెడ్డిలు దాదాపు రూ.5 లక్షల వ్యయంతో ఎరుకల నాంచారమ్మ ఆలయం ఆధ్వర్యంలో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వైఎస్ మధురెడ్డి మాట్లాడుతూ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. భక్తులకు, అటు గ్రామస్తులకు అందరికీ అందుబాటులో ఉండటం వల్ల ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం వైఎస్ మధురెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తాలూకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, మండల పరిశీలకులు బండి రామమునిరెడ్డి, సర్పంచు గంగయ్య, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

**వేంపల్లె :** మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించి తక్షణమే స్పందించి పరిష్కరించేందుకు కృషి చేయాలని వేంపల్లె జడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆ యా శాఖల అధికారులు మండల పరిధిలోని పలు అంశాలు, అభివృద్ధి, ప్రభుత్వ పాలన గురించి వివరించారు. ముఖ్యంగా రైతులకు అందిస్తున్న వివిధ పథకాలపై, వాటి సద్వినియోగంపై వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. అలాగే విద్యుత్, వైద్యం, ఉపాధి, విద్యా, తదితర అంశాలపై ఆయాశాఖల అధికారులు తెచ్చిన సమాచారాన్ని చదివి వినిపించారు. ఆయాపరిధిల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటిని వెంటనే పరిష్కరించాలని జడ్పీటీసీ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కింద 90 శాతం రుణసౌకర్యం కల్పిస్తుందని, 35శాతం సబ్సిడీ కింద సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమ క్రమబద్ధీకరణ పథకాన్ని అమలు చేసుకున్నట్లు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ రిసోర్స్ పర్సన్ శివయ్య వివరించారు. జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇది వ్యాపారాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా, శిశుసంక్షేమానికి కృషిచేస్తుందని, అందులో భాగంగానే గర్భిణీ, బాలింత మహిళలకు సంబంధించిన పౌష్టికాహార రేషన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కింద లబ్ధిదారునికి పోషకాహారం అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మిగాయత్రి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు బాబాషరీఫ్, రమణమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, హౌసింగ్ ఏఈ సుబ్రమరెడ్డి, ఎంఈఓ స్టాలిన్ ఐజాక్, ఏపీఎం బాలస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌రెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్, ఆర్అండ్‌బీ ఎస్ఈ వెంకటరమణ, ఏపీఓ చంద్రశేఖర్, పీహెచ్‌సీ వైద్యులు నిజాముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపయ్యనే పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం


మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డికి మట్టి వినాయక విగ్రహాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

**పులివెందుల :** పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు ఎంతో మేలు చేస్తాయని మట్టి గణపతినే ప్రతి ఒక్కరూ పూజించాలని పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వల్లపు వరప్రసాద్‌లు ప్రజలకు పిలుపునిచ్చారు. పులివెందుల ఇస్లాంపురం జిల్లా పరిషత్తు ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పి.సనావుల్లా, యూనస్‌లు వినాయకచవితి పండుగ సందర్భంగా మట్టి వినాయకుని విగ్రహాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ పర్యావరణానికి ముప్పు వాటిల్లోందని ఇలాంటి పరిస్థితుల్లో మట్టి గణపతులను పూజించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన సమాజాన్ని అందించిన వారుమవుతామన్నారు. కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫిజుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి


తొండూరు : పంటలు పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి

**చెన్నూరు :** మండలంలో కేసీ కెనాల్ కింద సాగు చేయని పంట పొలాలలో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి కె.శ్రీదేవి కోరారు. శనివారం చెన్నూరు రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీతో మినుములు, జొన్నలను ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఎర్రసాని మోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో పంపిణీ చేసి మాట్లాడారు.

**తొండూరు :** బోరుబావుల కింద సాగుచేసుకున్న ప్రతి రైతు ఉద్యానవన పంటలకు సంబంధించి తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి మైఖెల్ రాజీవ్ తెలిపారు. శనివారం మండలంలోని గుండ్లమడుగు, సైదాపురం, మదూరు, జాలపర్తి, తదితర గ్రామాల్లో ఉద్యానవన పంటలను పర్యవేక్షించారు. ఉద్యానవన పంటలు సాగుచేసిన ప్రతి రైతు పంట నమోదుతో పాటు ఈకేవైసీ తప్పక చేయించుకోవాలని ఆయన కోరారు. ఉద్యానవనశాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మధుసూదన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ఏఈపై ఆరోపణలు సరికాదు

**చెన్నూరు :** చెన్నూరు విద్యుత్ ఏఈ రామలింగారెడ్డిపై నిరాధార ఆరోపణలు చేయడం తగదని స్థానిక నాయకులు గుమ్మల మధుసూదన్‌రెడ్డి, నామాల శివారెడ్డి, మునిసుబ్బారెడ్డిలు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ చెన్నూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లో ఓల్టేజీ సమస్య ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన మంజూరు చేయించారన్నారు. ఇందులో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎస్‌బీఐ కాలనీలో ఏర్పాటు చేసేందుకు పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి వద్ద కడుతుంటే అతను వాళ్ల ఇంటి వద్ద కాకుండా, తమ ఇంటి వద్ద కట్టమని విద్యుత్ అధికారులకు సూచించారన్నారు. దీంతో అధికారులు తాము లేని సమయంలో తమ ఇంటి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కోసం దిమ్మె ఏర్పాటు చేయగా దాన్ని తొలగించాలని మేము ఈనెల 16వ తేదీ విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అసలు విషయాన్ని పక్కదారి పట్టించడానికి పొట్టిపాటి చంద్ర ఏఈపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.